క్లుప్తంగా

క్విజ్ పోటీల్లో పాల్గొనండి

బొంరాస్‌పేట: రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో విద్యార్థులు, విద్యావంతులైన యువతీ యువకులు పాల్గొనాలని కాంగ్రెస్ పార్టీ బొంరాస్‌పేట, దుద్యాల మండలాల అధ్యక్షులు నర్సింహులు గౌడ్, ఆవుటి శేఖర్ గురువారం వేర్వేరుగా తెలిపారు. ఈ నెల 18న జరిగే పోటీల్లో 16 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్కులు పాల్గొనాలని సూచించారు. 60 నిమిషాల పాటు జరిగే పోటీలో 60 ప్రశ్నలకు జవాబులు ఇవ్వాలన్నారు. విజేతలకు లాప్‌టాప్, స్మార్ట్ ఫోన్, ట్యాబ్ బహుమతులుంటాయని తెలిపారు. యువతులకు ప్రత్యేక బహుమతి స్కూటీ ఉంటుందని వెల్లడించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న నాయకులు, ఉపాధ్యాయులు

కుల్కచర్ల: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడంతో పాటు ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పిస్తుందని జెడ్పీటీసీ రాందాస్ నాయక్ అన్నారు. శుక్రవారం చౌడాపూర్ మండలం మక్తవెంకటాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుపేద కుటుంబీకుల చిన్నారులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతుందని, మీ పిల్లలను సర్కారు బడిలో చేర్పించాలని గ్రామస్తులను కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి మహేశ్వర్ రెడ్డి, నాయకులు వెంకట్ పవర్, నీల్య తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకే షీ టీంలు



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

పరిగి: మహిళల భద్రత కొరకు షీ టీంలు పని చేస్తున్నాయని షీ టీం ఇన్‌చార్జి నర్సింహులు అన్నారు. గురువారం పట్టణ కేంద్రంలోని తుంకులగడ్డ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో షీ టీం ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నర్సింహులు మాట్లాడారు. బాల్య వివాహాలు చేయడం నేరమని, ఎక్కడైనా అలాంటివి జరిగితే వెంటనే 181కి సమాచారం అందించాలని సూచించారు. బాలబాలికలు బడిలో ఉండాలని, ఎక్కడైనా వారు పనిలో ఉంటే సమాచారం ఇచ్చి, బాలకార్మిక వ్యవస్థను రూపుమాపేందుకు కృషి చేయాలని చెప్పారు. మహిళల భద్రత కోసం షీ టీంలు నిరంతరం పనిచేస్తున్నాయని, ఎక్కడ ఏం జరిగినా వెంటనే సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో షీ టీం సభ్యులు శోభారాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

కొడంగల్: మండల పరిధి గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను గురువారం తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అందజేసి మాట్లాడారు. పేదలకు ఆపత్కాలంలో సీఎంఆర్ఎఫ్ నిధులు మంజూరు చేసి ఆదుకుంటున్నట్లు చెప్పారు.

ప్రారంభానికి నోచుకోని మీటింగ్‌హాల్



మీటింగ్‌హాల్ భవనం

బంట్వారం: రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన మీటింగ్‌హాల్ భవనం ఏళ్ల తరబడి ప్రారంభానికి నోచుకోవడం లేదు. బంట్వారం మండల కేంద్రంలో 13 సంవత్సరాల కిందట మీటింగ్‌హాల్ నిర్మాణ పనులు చేపట్టారు. అప్పట్లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్‌గా ఉన్న పట్నం సునీతారెడ్డి ఇందుకు అవసరమైన జెడ్పీ నిధులను మంజూరు చేశారు. భవన నిర్మాణం పూర్తయి.. చిన్నపాటి పనులు మిగిలి ఉండడంతో ఏళ్ల తరబడి నిరుపయోగంగానే ఉంది. ఇదిలా ఉండగా ఇదే భవనానికి సునీతారెడ్డి.. అదనంగా మరో రూ.ఐదు లక్షలు ఐదేళ్ల కిందట మంజూరు చేశారు. అయినప్పటికీ అసంపూర్తి పనులు మాత్రం నేటికీ పూర్తి కాలేదు. ఇప్పటికైనా సంబంధితఅధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రత్యేక రాష్ట్రంలోనే పల్లెల అభివృద్ధి

'గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తోంది. అవసరమైన నిధులు కేటాయించి పల్లెలను అన్ని రంగాల్లో రాణించేలా కృషి చేస్తోంది. ప్రతి ఊర్లో పల్లెప్రకృతి వనం, నర్సరీలు ఏర్పాటు చేసి పచ్చదనంతో కళకళలాడేలా చేసింది' అని ప్రజాప్రతినిధులు, అధికారులు అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పల్లెల్లో నిర్వహించిన పల్లె ప్రగతిలో వక్తలు మాట్లాడారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉన్నాయంటే అందుకు కారణం పారిశుద్ధ్య కార్మికులే అని చెప్పారు.

కేసీఆర్‌తోనే గ్రామస్వరాజ్యం

- ఆహ్లాదాన్ని పంచే పల్లెప్రకృతి
- పారిశుద్ధ్య కార్మికుల సేవలు అమోఘం
- పల్లెప్రగతి ఉత్సవాల్లో వక్తలు
- ఊరూరా జాతీయ జెండాలను ఆవిష్కంచిన ప్రజాప్రతినిధులు, అధికారులు



దోమ: పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి



మోమిన్‌పేట: పల్లెప్రకృతి ర్యాలీలో సర్పంచ్ తదితరులు

తాండూరు రూరల్: ముఖ్యమంత్రి కేసీఆర్‌తోనే గ్రామ స్వరాజ్యం సాధ్యమని పర్వతాపూర్ సర్పంచ్ లాల్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవంలో భాగంగా గురువారం గ్రామంలో పల్లె ప్రగతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ రాకముందు పల్లెలు ఎలా ఉన్నాయో.. వచ్చిన తర్వాత ఎలా ఉన్నాయనే విషయాన్ని గ్రామస్తులకు వివరించారు. పారిశుద్ధ్యంతో పాటు గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించిన ఘనత ముఖ్యమంత్రిదేనని చెప్పారు. అనంతరం పంచాయతీ కార్మికులను శాలువ, పూలమాలతో సన్మానించారు.

మోమిన్‌పేటలో..

మోమిన్‌పేట: పల్లె ప్రకృతి వనాలు గ్రామస్తులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తున్నాయని ఎంపీటీ యాదగిరి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన పల్లెప్రగతిలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. పల్లె ప్రకృతి వనం, నర్సరీల వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం ఎంపీటీ మాట్లాడారు. గ్రామాలు ఎంతో స్వచ్ఛతను చాటుతున్నాయని, స్వచ్ఛత, సుపరిపాలనతో మండల, జిల్లా, జాతీయ అవార్డులు పొందినట్లు గుర్తు చేశారు. గ్రామాల్లో మొక్కలు నాటేందుకు.. స్థానికంగానే నర్సరీలు ఏర్పాటు చేసి.. మొక్కలు పెంచుతున్నామని వెల్లడించారు. అనంతరం సఫాయి కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి నర్సింహులు పాల్గొన్నారు.

అనంతగిరిలో..

అనంతగిరి: దశాబ్ది ఉత్సవాల సందర్భంగా వికారాబాద్ మండల పరిధి గ్రామాల్లో పల్లె ప్రగతి ఉత్సవాలు జరిపారు. గ్రామపంచాయతీ కార్యాలయం, డంపింగ్ యార్డ్ , పల్లె ప్రకృతి వనం, నర్సరీలను ఈ సందర్భంగా అలంకరించారు. జాతీయ జెండాలు ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన గ్రామసభలో తెలంగాణ వచ్చినప్పటి నుంచి చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. జీపీ సిబ్బందిని సన్మానించారు.

దౌల్తాబాద్‌లో..

దౌల్తాబాద్: గ్రామాల్లో పారిశుద్ధ్య కార్మికుల సేవలు అమోఘమని ఎంపీపీ విజయ్‌కుమార్ అన్నారు. దశాబ్ది వేడుకల్లో భాగంగా మండలంలోని ఆయా గ్రామాల్లో పల్లెప్రగతి సంబరాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా జీపి కార్మికులను సన్మానించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం పల్లెలు అభివృద్ధి చెందాయని ఎంపీపీ అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తిరుమలస్వామి, సర్పంచ్ శిరీష, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కుల్కచర్లలో

కుల్కచర్ల: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల పరిధి గ్రామాల్లో పల్లెప్రగతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీల వద్ద జాతీయ జెండాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ హరికృష్ణ, ఎంపీడీఓ నాగవేణి, సర్పంచ్ సౌమ్యారెడ్డి, ఉప సర్పంచ్ పండరయ్య, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, వార్డు సభ్యులు మైపాల్, వెంకటేశ్, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీలు, మహిళా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పూడూరులో..

పూడూరు: బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామ పంచాయతీలు అభివృద్ధి చెందాయని ఎంపీపీ మల్లేశం అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండల పరిధి గ్రామాల్లో పల్లెప్రగతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉన్నాయంటే అందుకు పంచాయతీ కార్మికుల శ్రమే కీలకమని చెప్పారు. అనంతరం పంచాయతీ కార్మికులను సన్మానించి, సర్టిఫికెట్లను అందజేశారు.

పర్యావరణ పరిరక్షణకు..

దోమ: పర్యావరణ పరిరక్షణకు పల్లె ప్రకృతి వనాలు ఎంతో తోడ్పడతాయని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి అన్నారు. బడెంపల్లిలో నిర్వహించిన పల్లె ప్రగతి కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపడడం హర్షించదగిన విషయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కవిత, జెడ్పీటీసీ నాగిరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గోపాల్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజిరెడ్డి, ఎంపీటీసీ రాములు, సర్పంచ్ కోళ్ల సురేశ్, స్పెషల్ ఆఫీసర్ సోమలింగం, పంచాయతీ కార్యదర్శి రాము, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బొంరాస్‌పేటలో..

బొంరాస్‌పేట: ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనతో పల్లె, పట్టణ రూపురేఖలు మారాయని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. దుద్యాల మండలం ఆలేడ్‌లో రూ.20లక్షలతో గ్రామపంచాయతీ నూతన భవన నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొమ్మిదేళ్ల స్వరాష్ట్రపాలనలో ఎక్కడలేని, ఎన్నడూ లేని సంక్షేమం నెలకొందని చెప్పారు.

బంట్వారంలో..

బంట్వారం: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బంట్వారం, కోట్‌పల్లి మండలాల్లో పల్లె ప్రగతి దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద సర్పంచ్‌లు జాతీయ జెండాను ఎగుర వేశారు. జీపీ వర్కర్లకు శాలువ, పూలమాలలతో సత్కరించారు.

కుల్కచర్లలో..

కుల్కచర్ల: పంచాయతీల పాలనలో కార్మికుల పాత్ర ఎంతో గొప్పదని అల్లాపూర్ సర్పంచ్ సివిబాలునాయక్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పల్లెప్రగతి కార్యక్రమంలో జీపీ కార్మికులు, వనసేవకులను సన్మానించి, ప్రశంసా పత్రాలు అందజేశారు.

పెద్దేముల్‌లో..

పెద్దేముల్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండల పరిధి గ్రామాల్లో పల్లెప్రగతి ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయాల వద్ద జాతీయ జెండాలను ఎగురవేసి, పంచాయతీ కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి లలితకుమారి, ఎంపీడీఓ లక్ష్మప్ప, ఎంపీఓ, ఆర్ఐ రాజీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మర్పల్లిలో..

మర్పల్లి: పల్లెప్రగతితో గ్రామాల రూపు రేఖలు మారాయని మర్పల్లి జెడ్పీటీసీ మధుకర్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో మండల పరిధి గ్రామాల్లో నిర్వహించిన పల్లెప్రగతి కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీ వద్ద సర్పంచ్‌లు జాతీయ జెండాలను ఎగుర వేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై గ్రామ సభల్లో పంచాయతీ కార్యదర్శులు చదివి వినిపించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు సోయెల్, మార్కెట్ డైరెక్టర్ గౌస్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



దౌల్తాబాద్‌లో..



కుల్కచర్ల: జాతీయ జెండా ఆవిష్కరణలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు



పూడూరు: అంగడిచిట్టంపల్లిలో జీపీ కార్మికులను సన్మానిస్తున్న సర్పంచ్ తదితరులు



తాండూరు రూరల్: పంచాయతీ సిబ్బందిని సన్మానిస్తున్న సర్పంచ్ లాల్‌రెడ్డి



మర్పల్లిలో.. పారిశుద్ధ్య కార్మికులతో జెడ్పీటీసీ మధుకర్

నేడు మున్సిపల్ ఆధ్వర్యంలో ఉత్సవాలు

తాండూరు టౌన్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో వేడుకలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ శంకర్ సింగ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8 గంటలకు పాత మున్సిపల్ భవనం నుంచి బోనాల ఊరేగింపు, ఇందిరాచౌక్‌లో మానవహారం, అనంతరం కొత్త మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు. 11 గంటలకు కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరణ ఉంటుందన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన పలువురు ఉద్యోగులను సన్మానించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి, కలెక్టర్ నారాయణ రెడ్డి, ఆర్డీఓ అశోక్ కుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ స్వప్న తదితరులు పాల్గొంటారన్నారు.

బీఎల్వోలుగా కార్యదర్శులు

మోమిన్‌పేట: బీఎల్వోలుగా పంచాయతీ కార్యదర్శులను నియమించినట్లు తహసీల్దార్ కిరణ్ కుమార్ తెలిపారు. ఓటర్ల జాబితాతో ఇంటింటి సర్వే పనులు ప్రారంభించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఓటరుగా నమోదు చేసుకోవడం, తప్పొప్పుల సవరణలు చేసుకోవచ్చని ఆయన సూచించారు. ఓటర్ల జాబితాతో బీఎల్వోలు ఇంటింటికి వెళ్లి తప్పొప్పుల గురించి ఆరా తీస్తారని, వెంటనే సవరణలు చేసుకునేందుకు అవకాశం కల్పించినట్లు ఆయన ప్రకటించారు. బీఎల్వోలకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

ప్రొటోకాల్ పాటించని అధికారులపై ఫిర్యాదు

వికారాబాద్: అధికారిక కార్యక్రమాల్లో స్థానిక అధికారులు ప్రొటోకాల్ పాటించకపోవటంపై జెడ్పీ వైస్‌చైర్మన్ బైండ్ల విజయ్‌కుమార్ సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. గురువారం మోమిన్‌పేట మండల పరిధి గ్రామాల్లో ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ పలు అభివృద్ధి కార్యక్రమాలతో పాటు, జీపీ భవనాలకు శంకుస్థాపన చేశారు. జెడ్పీ వైస్‌చైర్మన్‌తో పాటు మోమిన్‌పేట జెడ్పీటీసీని ఆహ్వానించక పోవటమే కాకుండా.. ఈ కార్యక్రమాలకు సంబంధించి ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. ఈ విషయంపై విజయ్‌కుమార్.. జిల్లా ప్రొటోకాల్ అధికారి డీఆర్వో అశోక్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన డీఆర్వో.. విచారణ అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సర్వర్ డౌన్‌తో తిప్పలు

మోమిన్‌పేట: కుల, ఆదాయ సర్టిఫికెట్ల కోసం ఎదురు చూస్తున్న దరఖాస్తు దారులు.. సర్వర్ డౌన్‌తో ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ సర్వర్ డౌన్ ఉంటే.. ఆటు కుల వృత్తుల అర్జీలకు గడువు ముంచుకువస్తోందని, రూ.లక్ష ఆర్థిక సహాయం కోసం ఈ నెల 20వ తేదీ వరకు అప్లికేషన్ పెట్టుకునేందుకు ప్రభుత్వం గడువు విధించిందని లబ్ధిదారులు వాపోతున్నారు. అధికారులు మాత్రం సర్వర్ డౌన్ అని చెప్పడంతో ఏమి చేయాలో తోచడం లేదని ఆందోళన చెందుతున్నారు. ఈ సందర్భంగా దరఖాస్తు గడువు పెంచాలని పలువురు కోరుతున్నారు.

ఇసుక దోపిడీని అరికట్టాలి

- దాడులు చేస్తే ప్రతిదాడులు తప్పవ్
- పాత తాండూరు వాసులు

తాండూరు టౌన్: 'ఇసుక మాఫియా విచ్చలవిడితనానికి కాగ్నా పరివాహక ప్రాంతం బీడు భూమిగా మారే ప్రమాదం ఉంది. భూగర్భ జలాలు అడుగంటి తాగు, సాగునీటికి కటకట ఏర్పడనుందని' పాత తాండూరు వాసులు వాపోయారు. ఈ మేరకు వారు బుధవారం రాత్రి అక్రమ ఇసుక రవాణాను అడ్డుకోవాలని తీర్మానించారు. ఇసుక తరలింపునకు ఎలాంటి అనుమతులు ఇవ్వకూడదని ఇప్పటికే ఆర్డీఓ, డీఎస్పీ, తహసీల్దార్లకు విన్నవించారు. ఇటీవల అక్రమంగా రాత్రివేళ పాత తాండూరు మీదుగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను అడ్డుకున్న వీఆర్ఏ ఎల్లప్పపై విచక్షణారహితంగా ఇసుక దొంగలు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. పాత తాండూరు పరిధిలోని ఇసుక తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు, రెవెన్యూ అధికారులను వేడుకున్నారు. ఎన్నిసార్లు సంబంధిత అధికారులకు చెప్పినా.. ఇసుక దోపిడీ కొనసాగుతూనే ఉందని, బుధవారం రాత్రి కూడా దోపిడీ పర్వం కొనసాగడం వింతంగా ఉందని నిరసనకారులు వాపోయారు. భూగర్భ జలాల పరిరక్షణకు అందరూ కదిలి రావాలి, ఇసుక మాఫియా దాడులకు పాల్పడితే.. తాము చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఉన్నతాధికారులు స్పందించి ఇసుక దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. లేని యెడలా తామంతా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.



ఇసుక రవాణాను అడ్డుకోవాలంటూ నిరసన తెలుపుతున్న పాత తాండూరు వాసులు

గ్రామాల అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

పెద్దేముల్: గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. గురువారం హన్మాపూర్, తట్టెపల్లి, జైరాంతండా, ఓంలానాయక్ తండాల్లో నూతన గ్రామ పంచాయతీ భవనాలకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన మాట ప్రకారం గ్రామాలు, పల్లెల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ అనురాధ, ఎంపీడీఓ లక్ష్మప్ప, సర్పంచులు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్ నాయకులు రమేష్‌కుమార్, వెంకటేశ్‌చారీ, జైరాం నాయక్, ధన్‌సింగ్, గోపాల్, వెంకట్, జనార్దన్‌రెడ్డి, శంకర్, రవినాయక్, అంజప్ప, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



జీపీ భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

రూ.23 కోట్లతో రోడ్డు పనులు

తట్టెపల్లి నుంచి అడ్కిచెర్ల మీదుగా రూ.23కోట్ల నిధులతో చేపడుతున్న బీటీరోడ్డు పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని ఈ సందర్భంగా కాంట్రాక్టర్‌కు చెప్పారు.

వృథాగా నీటి తొట్లు

కొడంగల్: గ్రామీణ నీటి తొట్లు వృథాగా మారాయి. వేసవి కాలంలో పశు పక్షాదుల దాహార్తి తీర్చడానికి నీటి తొట్లు నిర్మించారు. ఆ తొట్లలో నీటిని నింపితే పశువులకు నీరు తాగడానికి అనుకూలంగా ఉంటుందని ఎన్ఆర్ఈజీఎస్ కింద ఏర్పాటు చేశారు. అయితే గ్రామ పంచాయతీ సిబ్బంది నీటిని నింపాల్సి ఉండగా.. వారు ఆసక్తి చూపకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. పంచాయతీల ద్వారా కాకుండా ప్రస్తుతం మిషన్ భగీరథ ద్వారా గ్రామాలకు తాగునీరు సరఫరా చేస్తున్నారు. దీంతో కుళాయిల్లో నీటిని నింపడానికి అవకాశం లేకుండా పోయింది.



నిరుపయోగంగా ఉన్న నీటి తొట్టి

యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

వికారాబాద్ అర్బన్: యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ స్నేహభావంతో క్రీడల్లో పాల్గొనాలని మాజీ మంత్రి, బీజేపీ సీనియర్ నాయకుడు డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. అనంత పద్మనాభ క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో వారం రోజులుగా బ్లాక్ గ్రౌండ్‌లో నిర్వహించిన టెన్నిస్ బాల్, క్రికెట్ టోర్నమెంట్ గురువారం ముగిసింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన.. నగదు ప్రోత్సాహకం కింద రూ. 50వేలు విజేతలకు అందజేసి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ కనబర్చి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివరాజ్, మాధవరెడ్డి, నాయకులు శివకుమార్, నవీన్ పాల్గొన్నారు.



విజేతలకు నగదు ప్రదానం చంద్రశేఖర్

స్వీట్‌కార్న్ సాగు భలే బాగు

- 100 రోజులకే పంట చేతికి
- మార్కెట్ అందుబాటులో లేక రైతుల ఇబ్బంది
- దూర ప్రాంతాలకు తరలించి విక్రయాలు
- తడిసి మోపెడవుతున్న రవాణా ఖర్చులు
- కనీస మద్దతు ధర పెంచాలంటున్న కర్షకులు



పెద్దేముల్‌లో సాగవుతున్న మొక్కజొన్న

పెద్దేముల్: తక్కువ సమయంలో పంట చేతికి వచ్చే మొక్కజొన్న పొత్తులు(స్వీట్‌కార్న్) సాగు మండలంలో అధికంగా సాగవుతోంది. గతంలో హన్మాపూర్, తట్టెపల్లి, గాజీపూర్, బుద్దారం గ్రామాల్లో సాగవగా.. మార్కెట్లో డిమాండ్ పెరిగింది. దీంతో పెద్దేముల్, మంబాపూర్, ఇందూరు, గోట్లపలి, గిర్మాపూర్‌తో పాటు పలు గ్రామాల రైతులు స్వీట్‌కాన్ సాగుకు ఆసక్తి చూపుతున్నారు. సాగు తక్కువ ఉన్న సమయంలో రైతులు తాండూరు, వికారాబాద్ ప్రాంతాల్లో విక్రయించేవారు. ప్రస్తుతం సాగు ఎక్కువ కావడంతో బోయిన్‌పల్లి (హైదరాబాద్) మార్కెట్‌కు తరలించి విక్రయిస్తున్నారు. అయితే మద్దతు ధరలో ఎప్పటికప్పుడు మార్పులు రావడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. నెల రోజుల క్రితం క్వింటా స్వీట్‌కార్న్‌కు రూ.1,800 నుంచి రూ.2 వేలు పలకగా.. ప్రస్తుతం రూ.1,400 నుంచి 1,600లు పలుకుతున్నట్లు వాపోతున్నారు.

పచ్చిగడ్డికి డిమాండ్

మొక్కజొన్న(స్వీట్‌కార్న్)సాగు పచ్చిగడ్డికి డిమాండ్ ఉంది. పశువులకు మేతగా ఉపయోగపడే గడ్డి కావాలని.. పశువులు ఉన్న రైతులు విత్తనం నాటే సమయంలో స్వీట్‌కార్న్ సాగుచేసే వారికి అడ్వాన్స్ చెల్లిస్తున్నారు. ఇదిలా ఉండగా.. తాండూరులో విత్తనాలు అందుబాటులో లేక రైతులు వికారాబాద్‌లో ఖరీదు చేస్తున్నారు. కిల్లో రూ.2 వేల నుంచి రూ.2,500లకు కొనుగోలు చేస్తున్నారు. విత్తనాలు విత్తిన నాటి నుంచి పంట చేతికి వచ్చే వరకు ఆరు సార్లు మందు పిచికారి, రెండుసార్లు డీఏపీ ఎరువులు, మూడు సార్లు కలుపు తీయటం చేస్తామని రైతులు చెప్పారు. అయితే ప్రస్తుతం రానున్న వర్షాకాలంలో స్వీట్‌కార్న్‌కు డిమాండ్ పెరుగుతుందని, తద్వారా మద్దతు ధర పెరిగే అవకాశం ఉందని కర్షకులు చెప్పారు.

సబ్సిడీపై విత్తనాలు ఇవ్వాలి

స్వీట్‌కార్న్ సాగుచేసే రైతులకు రాయితీపై ప్రభుత్వం విత్తనాలు అందజేయాలని రైతులు కోరుతున్నారు. అంతే కాకుండా మార్కెట్ అందుబాటులో లేక ఇబ్బంది పడుతున్నామని, స్థానికంగా మార్కెట్ లేక తాండూరు, విరాకాబాద్, మర్పల్లి, సదాశివపేట, బొయిన్‌పల్లి మార్కెట్‌కు తరలించి విక్రయిస్తున్నామని రైతులు వెల్లడించారు. రవాణా, కూలీల ఖర్చులు తీసేస్తే.. గిట్టుబాటు కావడం లేదని వాపోతున్నారు. స్థానికంగా మార్కెట్ ఏర్పాటు చేస్తే బాగుంటుందని, సంబంధిత అధికారులు మార్కెట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. 100 రోజులకే పంట చేతికి రావడం, ప్రస్తుత సీజన్‌లో ధర బాగుండడంతో మరింత మంది రైతులు సాగుకు మొగ్గు చూపుతున్నారు. ఇదిలా ఉండగా.. పెట్టుబడి చేస్తున్న ఖర్చులకు, విక్రయించగా వస్తున్న సొమ్ముకు పొంతన లేకుండా పోయిందని, ఫలితం తక్కువ.. పని ఎక్కువగా ఉందని రైతులు చెప్పారు. ప్రభుత్వం కనీస మద్దతు ధర క్వింటాకు రూ.2,600లు చేస్తే పెట్టుబడులు పోను కష్టానికి తగిన ఫలితం దక్కుతుందని, అదే సమయంలో తాండూరు లేదా వికారాబాద్‌లో మార్కెట్‌ను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.